క్లుప్తంగా

వైఎస్‌ జగన్‌తో భీమిరెడ్డి భేటీ



వైఎస్‌ జగన్‌తో నాగమల్లేశ్వర్‌రెడ్డి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ జిల్లా లీగల్‌ సెల్‌ సభ్యుడు భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి బుధవారం అమరావతిలో మాజీ ముఖ్యమంత్రి, ఆ పార్టీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో పలు అంశాలపై చర్చించారు. వైఎస్సార్‌ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని వైఎస్‌ జగన్‌ సూచించినట్లు భీమిరెడ్డి తెలిపారు.

చిన్నారులపై కుక్కల దాడులు



గుంపుగా తిరుగుతున్న కుక్కలు

ముండ్లమూరు (కురిచేడు): చిన్నారులను కుక్కలు కరిచి గాయపరుస్తున్నాయి. ముండ్లమూరు మండలం పోలవరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నపిల్లలు బయటకు వెళ్లేందుకు భయాందోళనలు చెందుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడద నుంచి చిన్నారులను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి లోకాభిరామ స్వామి ఆలయ ధ్వజ ప్రతిష్ఠ

బేస్తవారిపేట: మండలంలోని లక్ష్మీపురంలో లోకాభిరామస్వామి ఆలయంలో ధ్వజ, కలశ, నవగ్రహ దేవతా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

29న పంచగవ్యప్రాసన, నవగ్రహ దేవతా ఆవాహన, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం, అర్చనలు, 30న ప్రతిష్ఠ మూర్తులకు అభిషేకం, నవగ్రహ మూలమంత్ర హోమాలు, 31న గర్త పూజ, యంత్రస్థాపన, విగ్రహ శిఖర కలశ, ధ్వజ ప్రతిష్ఠ, కళాన్యాసం, పూర్ణాహుతి పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

రేషన్‌ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

మార్కాపురం టౌన్‌: మార్కాపురం పట్టణంతో పాటు మండలంలోని రేషన్‌ డీలర్‌లు అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌ చిరంజీవి హెచ్చరించారు. బుధవారం ఉద్యోగుల విశ్రాంతి భవన్‌లో రేషన్‌ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ జరిగేదన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జూన్‌ ఒకటో తేదీ నుంచి రేషన్‌ దుకాణాల్లోనే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు అనువైన చోట రేషన్‌ షాపు ఏర్పాటు చేయాలని సూచించారు. నేమ్‌ బోర్డులు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని చెప్పారు.

రేషన్‌ సక్రమంగా పంపిణీ చేయాలి

ఒంగోలు సబర్బన్‌: ప్రజా పంపిణీ వ్యవస్థలో నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని రేషన్‌ షాపుల డీలర్లకు ఒంగోలు రెవెన్యూ డివిజనల్‌ అధికారి (ఆర్‌డీఓ) కె.లక్ష్మీ ప్రసన్న సూచించారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్‌ పరిధిలోని అన్ని మండలాల చౌకధరల దుకాణాల డీలర్లతో కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌ హాలులో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రేషన్‌ షాపుల వద్దే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం గురించి వివరించారు. ఎండీయూ వాహనాలు రద్దయిన దృష్ట్యా డీలర్లకు రేషన్‌ షాపుల నిర్వహణ, నిత్యావసర సరుకుల పంపిణీపై అవగాహన కల్పించారు. జూన్‌ 1న పండుగ వాతావరణంలో రేషన్‌ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తెలిపారు. దివ్యాంగులకు, 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు వారి ఇంటివద్దకే తీసుకెళ్లి డీలర్లు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్‌ షాపు వద్దనే కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకు తీసుకెళ్లి అందించాలన్నారు. వారు ఏ సమయాల్లో ఇంటి వద్ద ఉంటారో ముందుగా తెలుసుకుని డీలర్ల వీలును బట్టి ఇంటికి తీసుకెళ్లి ఇవ్వాలని స్పష్టం చేశారు. పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఎల్రక్టానిక్‌ వేయింగ్‌ మిషన్‌లను లీగల్‌ మెట్రాలజీ అధికారులచే తనిఖీ చేయించుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. సరుకుల తూకం విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దన్నారు. ఎప్పటికప్పుడు రేషన్‌ షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని ఆర్‌డీఓ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో భద్రత కరువు

- రద్దీగా ఉండే బస్టాండ్‌లో కనిపించని సీసీ కెమెరాలు
- తరుచూ జరుగుతున్న దొంగతనాలు



పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్

పెద్దదోర్నాల: నేరాల కట్టడిలో నిఘా కెమెరాల పాత్ర కీలకం. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎన్నో సమావేశాల్లో పోలీసులు చెబుతుంటారు. దొంగతనాలు జరిగినా, ఇతర సంఘటనలు చోటు చేసుకున్నా సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టి దొంగలను పసిగడుతుంటారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అటువంటి సీసీ కెమెరాలు లేక పోవడంతో ప్రయాణికులకు సంబంధించిన వస్తువుల భద్రత నామమాత్రంగా మారింది. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌కు ఎంతో ప్రాముఖ్యం ఉంది. మండల కేంద్రం నుంచి రాష్ట్రంలోని అన్ని సుదూర ప్రాంతాలకు 24 గంటలు బస్సు సౌకర్యం ఇక్కడి నుంచే ఉంది. దీంతో పాటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రానికి సంబంధించిన అన్ని పుణ్యక్షేత్రాలకు ఎన్నో సర్వీసులు క్రమం తప్పకుండా ఇక్కడి నుంచి నడుస్తుంటాయి. దీంతో పాటు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ నుంచి నిత్యం వందలాది మంది భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తి పీఠంగా వెలుగొందుతున్న శ్రీశైలం తరలి వెళ్తుంటారు. ఇంత ప్రాముఖ్యం ఉన్న బస్టాండ్‌లోని ప్రయాణికుల భద్రతపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలకు తావిస్తోంది.

యాత్రికుల వస్తువులకు భద్రతేదీ?

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అనునిత్యం ప్రయాణికుల రద్దీ ఉంటుంది. దీంతో పాటు మహాశివరాత్రి, ఉగాది, కార్తీక మాసం తదితర పర్వదినాల సందర్భంగా భక్తుల రద్దీ మరింత అధికంగా ఉంటుంది. ఆయా సందర్భాల్లో చైన్‌స్నాచర్లు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తూ సెల్‌ఫోన్లు, నగదు దోచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం మండల పరిధిలోని ఐనముక్కలకు చెందిన ఓ అంగన్‌వాడీ కార్యకర్త మెడలోని బంగారు చైన్‌ను లాగేందుకు ఓ దొంగ విఫలయత్నం చేశాడు. ఆమె తన చైన్‌ను గట్టిగా పట్టుకోవడంతో చైన్‌ను లాగేందుకు చైన్‌స్నాచర్‌ చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో పాటు మండల పరిధిలోని మోట్ల మల్లికార్జునపురానికి చెందిన ఓ భక్తురాలు సుదూర ప్రాంతానికి వెళ్తూ దొంగల హస్తలాఘవంతో తన బ్యాగును పోగొట్టుకుంది. నంద్యాల జిల్లా ఆత్మకూర్‌ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఆయా దొంగతనాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి భక్తుల వస్తువులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



పెద్దదోర్నాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

శిథిలావస్థకు చేరిన పాత బస్టాండ్‌ భవనం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో ఐదు దశాబ్దాల కాలం నాటి పాత బస్టాండ్‌ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అప్పట్లో దాతల సాయంతో ప్రజలు సేద తీరేందుకు భవనం, బావిని నిర్మించారు. భూగర్భ జలాలు ఎండిపోవడంతో బావి నిరుపయోగంగా మారింది. దీంతో బావిలో ఏవరైనా పడి ప్రమాదానికి గురవుతున్నారని స్థానికులు పూడ్చి వేశారు. ఇప్పటికి దాదాపు 50 ఏళ్లు పూర్తి చేసుకొని భవనం శిథిలావస్థకు చేరింది. పాత బస్టాండ్‌ భవనం బీటలు వారిన గోడల మధ్య పైకప్పు పెచ్చులూడి పడుతున్న శ్లాబు కింద క్షణ క్షణం భయం భయంగా ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. స్లాబ్‌ నెర్రలు ఇవ్వడంతో వర్షం నీరు కారడంతో కర్రల దంతెలు తడిసి పుచ్చి పోయి కొన్ని దంతెలు కింద పడ్డాయి. మరికొన్ని దంతెలు వేలాడుతున్నాయి. గోడలు, శ్లాబు నుంచి పెచ్చులు ఊడి చువ్వలు బయటకు వచ్చాయి. పాత బస్టాండ్‌ భవనం చుట్టుపక్కల హోటళ్లు, తినుబండరాల షాపులు, బంకులు, టీ షాపులు ఉన్నాయి. వర్షం పడుతున్న సమయంలో వాహనదారులు, ప్రజలు తలదాచుకునేందుకు పాత బస్టాండ్‌లో వేచి ఉంటారు. ఆ సమయంలో వర్షానికి తడిసిన స్లాబు పెచ్చులు ఊడి పడుతుంటాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పోయేంత వరకు ప్రజలు భవనంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతుంటారు. ప్రమాదం జరగకముందే అధికారుల స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి వేయాలని, స్థలం అక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులూడి చువ్వలు బయటకు కనిపిస్తున్న శ్లాబు



పెద్దారవీడు పాత బస్టాండ్‌ భవనంలో నెర్రలిచ్చిన గోడలు

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దారవీడు: విద్యార్థులు వేసవి కాలంలో గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది వ్యక్తులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి ప్రపంచ మేధావులయ్యారని, పుస్తకాలతో విశేషమైన జ్ఞానం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలతో గడుపుతూ వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకం పఠనం, పాటలు, వ్యాసరచన, చెస్‌ పోటీలు నిర్వహించారు. శిక్షకులు గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యారమ్స్‌ ఆడుతున్న విద్యార్థులు

డీజీపీ హరీష్‌కుమార్‌ గుప్తాకు అభినందనలు



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ దామోదర్‌

ఒంగోలు టౌన్‌: డీజీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న హరీష్‌కుమార్‌గుప్తాను ఎస్పీ ఏఆర్‌ దామోదర్‌ అభినందించారు. బుధవారం విజయవాడ నుంచి కడప వెళుతూ మార్గం మధ్యలో ఒంగోలులో డీజీపీ ఆగారు. ఆయనతో పాటు ఇంటెలిజెన్స్‌ అడిషనల్‌ డీజీపీ మహేష్‌ చంద్ర లడ్హా, లా అండ్‌ ఆర్డర్‌ అడిషనల్‌ డీజీపీ ఎస్‌.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీతో పాటు జిల్లా పోలీసు అధికారులంతా డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ వెంట అడిషనల్‌ ఎస్పీ (అడ్మిన్‌) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్‌ సీఐ సూర్యనారాయణ, టూటౌన్‌ సీఐ మేడా శ్రీనివాసరావు, వన్‌టౌన్‌ సీఐ నాగరాజు, తాలూకా సీఐ విజయకృష్ణ, రూరల్‌ సీఐ శ్రీకాంత్‌, ఆర్‌ఐ సీతారామిరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి వికసిత్‌ కృషి సంకల్ప అభియాన్‌

దర్శి (కురిచేడు): వికసిత్‌ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్‌ క్యాంపెయిన్‌ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు దర్శి కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్‌ జి.రమేష్‌ తెలిపారు. పొదిలి మండలం ఆముదాలపల్లి, కురిచేడు మండలం పొట్లపాడు, దొనకొండ మండలం ఆరవల్లిపాడు గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. రైతులకు సాగు మెళకువలు, పంటల ఎంపిక, అధిక దిగుబడినిచ్చే రకాలు, యాంత్రీకరణ సౌలభ్యం, పంటల యాజమాన్యం, సస్యరక్షణ, పోషక యాజమాన్యం, పాడిపశువుల యాజమాన్యం, మెళకువలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి గ్రామస్థాయి రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేసి వారిని ఖరీఫ్‌ సాగుకు సన్నద్ధంగా తయారు చేయడం ఉద్దేశమన్నారు. ఇందుకు కేవీకే కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉమ్మడిగా, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. నేటి నుంచి జరగబోయే కార్యక్రమంలో రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి



పెద్ద మసీదు వద్ద పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్‌ నారాయణరెడ్డి

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే మున్సిపల్‌ సిబ్బందితో తొలగిస్తామని నగర పంచాయతీ కమిషనర్‌ జీఎల్‌ నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు, చదును చేసే పనులను ఆయన పర్యవేక్షించారు. పెద్ద మసీదు వద్ద ఆక్రమణలు తొలగింపజేసి, జేసీబీతో చదును చేయించారు. కమిషనర్‌ మాట్లాడుతూ.. రోడ్డు పక్కన సైడు కాలువలపై ఎటువంటి కట్టడాలు నిర్మించినా సహించేది లేదన్నారు. ప్రధాన రహదారి మొత్తం పూర్తయిన తర్వాత మిగిలిన రోడ్ల లోనూ ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని, దుకాణదారుల బోర్డులు, పందిర్లు, షామియానాలు రోడ్డుపైకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇబ్బందుల్లో ఉన్న పిల్లల గుర్తింపు

ఒంగోలు సబర్బన్‌: జిల్లా వ్యాప్తంగా ఇబ్బందుల్లో ఉన్న పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్‌ ఏ తమీమ్‌ అన్సారియా తెలిపారు. స్థానిక ప్రకాశం భవన్‌లో బుధవారం వనరబుల్‌ చిల్డ్రన్స్‌ కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌ పాల్గొని మాట్లాడారు. ఇబ్బందులు పడుతున్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి స్కూళ్లో, స్కిల్‌ డెవలప్మెంట్‌ కోర్సుల్లో చేర్చే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. పిల్లలు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వం నుంచి ఏమైనా సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి అందకుంటే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అందుకోసం మొబైల్‌ - వెబ్‌ అప్లికేషన్‌ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముందుగా ప్రకాశం జిల్లాలోని రాచర్ల మండలాన్ని ఒక పైలెట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 360 మంది ఇబ్బందిపడుతున్న పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో 360 మంది పిల్లల్లో కొంతమంది డిజేబుల్‌ పిల్లలు మాకు టూ వీలర్‌, ఫోర్‌ వీలర్‌ చైర్స్‌ కావాలని అడగడంతో సంబంధిత అధికారుల ద్వారా వారికి వీల్‌ చైర్స్‌ ఇప్పించడం జరిగిందని వివరించారు. మిగతా పిల్లలకు కూడా ఎడ్యుకేషన్‌ పరంగా వారికి ఏం కావాలో అవి అందించడం జరిగిందన్నారు. నిజమైన అవసరాలు ఏమిటో గుర్తించి ఈ అప్లికేషన్‌లో పొందుపరచాలని, ఈ ట్రైనింగ్‌ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి డి.హేన్‌సుజన, జిల్లా బాలల సంరక్షణ అధికారి సి.దినేష్‌కుమార్‌, నోడల్‌ ఆఫీసర్‌ గిరిధర్‌ శర్మ, సునీల్‌ కుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.



గుట్టమీదపల్లి పొలాల్లో పచ్చిక మేస్తున్న పశువులు

వర్షంతో పొలాల్లో పచ్చిక

దొనకొండ: ద్రోణి ప్రభావంతో ఇటీవల వారం నుంచి కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు ఎండ వేడి నుంచి ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. అంతేకాకుండా భూములు పదును కావడంతో పొలాల్లో పచ్చిక పడింది. దీంతో పశువులు, గొర్రెలు, మేకలకు బీడు పొలాలు చిగురించి పచ్చిక బాగా ఉపయోగపడుతుంది. ఇంతవరకు ఎండుగడ్డి మీద ఆధార పడిన పశువులు ప్రస్తుతం పచ్చిక పొలాల్లో తిరుగుతూ కడుపు నిండా పచ్చిగడ్డి మేసి ఇళ్లకు వస్తున్నాయి. పశువులు తాగేందుకు కొద్దిపాటి కుంటల్లోకి నీరు వచ్చాయి. పశువుల కాపరులకు, రైతులకు ఎంతగానో ఉపయోగంగా ఉంది. తమ పశువులకు నీరు, మేత అందడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చిల్డ్రన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో బాలోత్సవం

దర్శి (కురిచేడు): దర్శి చిల్డ్రన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31, వచ్చే నెల 1వ తేదీల్లో చౌటపాలెం రోడ్డులోని శ్రీనివాస హాల్‌ పక్కన సుందరయ్య భవన్‌లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 6 నుంచి 15 సంవత్సరాలలోపు బాలబాలికలకు పేపర్‌ క్రాఫ్టింగ్స్‌, దేశభక్తి గీతాలు, డ్రాయింగ్‌, ఫన్నీగేమ్స్‌, ఫన్నీ మ్యాథ్స్‌, మ్యాథ్స్‌ ఫండమెంటల్స్‌, కథలు, ఆటలు, సైన్స్‌ మ్యాజిక్‌షో, డ్యాన్స్‌ తదితర అంశాలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు స్నాక్స్‌, తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. బాలోత్సవం లో పాల్గొనే చిన్నారులు తమ పేర్లు నమోదు చేయించుకునేందుకు 94940 20936, 94903 00391, 97056 20277, 98489 81820 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అనాథలకు అండగా మానవత సంస్థ

దర్శి (కురిచేడు): అనాథలకు అండగా తామున్నామంటూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అక్కున చేర్చుకుని తమకు చేతనైనంత సహాయ సహకారాలు అందిస్తూ అందరినోట మన్ననలు పొందుతోంది. అనాథ శవాలకు అంతిమ సంస్కారాలతో పాటు పేదలకు ఆపన్న హస్తం అందిస్తోంది. పట్టణంలోని ఎల్‌ఐసీ కాలనీలో 17 సంవత్సరాల నుంచి వడ్రంగి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గోళ్లపాటి వీరబ్రహ్మాచారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సంస్థ తరఫున రూ.14620, విశ్వబ్రాహ్మణ సంఘం తరఫున రూ.30,600, ఆ కాలనీలోని దాతల సహకారంతో రూ.5 వేలు సేకరించి మొత్తంగా రూ.50,220 గ్రామ పెద్ద తాతిరెడ్డి కొండారెడ్డి సమక్షంలో బుధవారం వీరబ్రహ్మాచారి భార్యకు అందజేశారు. సంస్థ ప్రతినిధులు దేవతి వరప్రసాదరావు, కపురం శ్రీనివాసరెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, గొర్రెపాటి వేణు, అడపాల గణేష్‌, జె.సుశీలమ్మ, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు శ్రీనివాసాచారి, రామాచారి, శ్రీనుబాబు, విశ్వరూపాచారి, నాగబ్రహ్మాచారి పాల్గొన్నారు.



వీరబ్రహ్మాచారి భార్యకు నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే

దర్శి (కురిచేడు): నిజమైన దేశభక్తులు, ప్రజాసేవకులు కమ్యూనిస్టులేనని దర్శి గౌతమి విద్యా సంస్థల చైర్మన్‌ కె.గుండారెడ్డి పేర్కొన్నారు. సీపీఐ 17వ జిల్లా మహాసభల లోగోను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండారెడ్డి మాట్లాడుతూ దర్శిలో సీపీఐ జిల్లా మహాసభలు జరపడం శుభపరిణామమన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజాసమస్యలు, రాష్ట్ర రాజకీయాలు, భవిష్యత్తు ఉద్యమాల కార్యాచరణకు దర్శి వేదిక కావడం సంతోషకరమన్నారు. జూన్‌ 21,22,23 తేదీల్లో దర్శిలో జిల్లా మహాసభలతో పాటు ఆగస్టులో రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. 500 మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు మూడు రోజుల పాటు దర్శిలో ఉంటారని తెలిపారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్యలు హాజరవుతారని తెలిపారు. లోగో ఆవిష్కరణలో ఏఐవైఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.కరుణానిధి, ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి ఎస్‌. రామాంజి యాదవ్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ వర్కర్స్‌ జిల్లా కార్యదర్శి సింగరకొండ శ్రీను, సీపీఐ దర్శి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, సీనియర్‌ నాయకులు కల్లూరి పెద్ద ఆంజనేయులు పాల్గొన్నారు.



సీపీఐ లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రమాదకరంగా చప్టా



చప్టాపై రహదారికి ఇరువైపులా దెబ్బతిన్న గోడలు

కొమరోలు: అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిపై పామూరుపల్లె సమీపంలో చప్టా ప్రమాదకరంగా మారింది. చప్టాపై రిటెయినింగ్‌ వాల్‌ దెబ్బతినడం, ఆ ప్రదేశంలో సింగిల్‌ రోడ్డు మాత్రమే ఉండటంతో వాహనాలు ఎదురుపడిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. చప్టా రిటెయినింగ్‌ వాల్స్‌ను పలుమార్లు వాహనాలు ఢీకొనడంతో క్రమంగా దెబ్బతిన్నాయి. రెండు పర్యాయాలు చప్టాపై నుంచి వాహనాలు అదుపుతప్పి బోల్తా పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చప్టా వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

